

అలరించిన పద్య నాటకాలు

కడప అర్బన్ : శ్రీశ్రీశ్రీ మూలపల్లి అయ్యవారెడ్డి స్వామి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ గ్రామ పెద్దల సహాయ సహకారాలతో శ్రీ వెంకటేశ్వర సాంస్కృతిక సంస్థ ప్రధాన కార్యదర్శి మధుబాబు 4 గొప్ప తెలుగు పద్యనాటకలు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపాసి వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే ఇటువంటి పద్యనాటకాలు ప్రతి సంవత్సరమూ తిరుణాల సందర్భంగా ప్రదర్శించటం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు న్యాయం, ధర్మం, నీతి, సంస్కృతి, సాంప్రదాయాలు తెలియచేస్తాయని తెలిపారు. రాష్ట్రంలో పేరుపొందిన నటీనటుల చేత గయోపాఖ్యానం యుద్ధం, రామాంజనేయ యుద్ధం, భవానీ, వారణాసి తదితర ఘట్టాలను ప్రదర్శించారు. అందులో భవాని ఘట్టంలో ప్రముఖ రంగస్థల నటులు శ్రీ వేంకటేశ్వర సాంస్కృతిక సంస్థ ప్రధాన కార్యదర్శి యస్.మధుబాబు భవనిగా, రత్న శ్రీ నర్తకిగా తమహావ భావన నటనతో పాటలు పద్యాలతో ప్రేక్షకులను అలరించారు.



కడుపు 'కోతలే'!

జిల్లాలో సిజేరియన్‌లకు అడ్డూఅదుపూ లేకుండాపోతోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జనవరి నెల వరకు ప్రయివేటు, ప్రభుత్వాస్పత్రుల్లో 35 వేల డెలివరీలు చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. 54 శాతం సిజేరియన్ ఆపరేషన్లు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మాతాశిశుమరణాలను తగ్గించాలనే ఉద్దేశంతో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వంటి ఆధునిక వసతి సదుపాయాలతో కూడిన వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చింది. కానీ సిజేరియన్‌ల విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో ఆశించిన ఫలితాలు రా వడం లేదనే వాదన వినిపిస్తోంది.

- జిల్లాలో సిజేరియన్స్ 52 శాతం
- ప్రభుత్వాస్పత్రుల్లో 41, ప్రయివేటులో 54 శాతం
- కట్టడికి కదలని జిల్లా వైద్యశాఖ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో 51 పిహెచ్‌సిలు, 12 సిహెచ్‌సిలు, ఏరియా, జిల్లా ఆస్పత్రులు, జిజిహెచ్ సహా సుమారు 208 ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులు ఉన్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మార్చి నుంచి జనవరి నెల వరకు 35 వేల ప్రసవాలు జరిగినట్లు తెలుస్తోంది. జిల్లాలోని 208 ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో 26,682 సాధారణ ప్రసవాలు కాగా, 14,472 సిజేరియన్‌లు చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈలెక్కన జిల్లాలోని ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో 54 శాతం సిజేరియన్ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో 9,224 సాధారణ ప్రసవాలు కాగా, 3,802 సిజేరియ న్‌లు చేసినట్లు తెలుస్తోంది. ఈలెక్కన ప్రభుత్వ ఆస్పత్రుల్లో 41 శాతం సిజేరియన్‌లు చేసినట్లు తెలుస్తోంది. ఏతావాతా చెప్పేదేమి టంటే జిల్లాలోని సిజేరియన్‌ల తీరుతెన్నులను పరిశీలిస్తే ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో 51 శాతం సిజేరియన్‌లు చేసినట్లు తెలు స్తోంది. ప్రపంచ ఆరోగ్యసంస్థ మార్గదర్శకాల ప్రకారం ఏటా 10 నుంచి 15 శాతం సిజేరియన్ శాతాన్ని మించకూడదనే లక్ష్యం. జిల్లా లోని 36 మండలాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో సుమారు ఐదు రెట్లకుపైగా సిజేరియన్ కేసులే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. నిత్యం రెక్కాడితేగానీ డొక్కాడని పేద, నిరక్షరాస్య మహిళల జీవితాలపై సిజేరియన్‌లు పెనుప్రభావం చూపించే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాసిరకం వైద్యసేవలు అందుతాయనే ఉద్దేశంతో పలువురు ప్రయివేటు కార్పొరేట్ ఆస్పత్రులకు పలువురు గర్భిణులు వెళ్తుండడం తెలిసిందే. జిజిహెచ్‌లో మెరుగైన డెలివరీ సదుపాయాలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్తుండడం పరిపాటిగా మారింది. ఇటువంటి దురవగాహనను ఆసరా చేసుకున్న ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులు కాసుల కోసం కడపుల్లో కత్తులు దూస్తున్నారు. సాధారణ కాన్పు చేయడానికి గంటల తరబడి ఓపిక పట్టాల్సి వస్తున్న నేపథ్యంలో సిజేరియన్‌ల వైపు మొగ్గు చూపుతున్నారనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిజేరియన్‌ల కట్టడికి పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి డ్రైవ్ నిర్వహించి సిజేరియన్‌ల కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై డిఎంహెచ్‌ఒను ఫోన్‌లో వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

స్థానిక సంస్థల వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పిఆర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

స్థానిక సంస్థల వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి పేరు ఖాయమైంది. సోమవారం విజయవాడలోని తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైసిపి తరుపున పోటీ చేయనున్న 18 మంది ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. జమ్మలమడుగుకు చెందిన మాజీ మంత్రి రామ సుబ్బారెడ్డి పేరు చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్ల ప్రకటన అనంతరం రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే మూలే సుధీర్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. మాజీ మంత్రి పిఆర్‌ను స్థానిక సంస్థల అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో వైసిపికి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులే మెజార్టీకి మించి ఉన్నారు. ప్రతిపక్ష టిడిపి స్థానిక సంస్థల అభ్యర్థిత్వానికి ఎవరి పేరును ప్రకటించకపోవడంతో పిఆర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2014 ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లాలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో హైటెన్షన్ వాతావరణం ఏర్పడిన సంగతి తెలిసిందే. అప్పటి అధికార టిడిపి జిల్లాలోని పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను చాపర్ల సహాయంతో పాండిచ్చేరి వంటి ప్రాంతాలకు తరలించడం, శిక్షణ ఇవ్వడం తెలిసిందే. అనంతర ఎన్నికల్లో గెలుపొందడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలు ఏకగ్రీవం దిశగా సాగుతోంది. అధికార వైసిపిలో ప్రత్యర్థుల మధ్య సయోధ్య నెలకొన్న నేపథ్యంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆధిపత్య, వెన్నుపోటు రాజకీయాలకు తెరపడినట్లేననే వాదన వినిపిస్తోంది.



సిఎం జగన్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇస్తున్న పిఆర్

న్యాయం చేయాలంటూ..

తల్లీకొడుకుల ఆత్మహత్యాయత్నం

- ఎస్‌పి కార్యాలయ ఆవరణలో ఘటన
- అడ్డుకున్న పోలీసులు
- చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలింపు

ప్రజాశక్తి - కడప అర్బన్

తమకు న్యాయం చేయాలంటూ తల్లీకొడుకులు ఎస్‌పి కార్యాలయ ఆవరణలో కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. అక్కడే ఉన్న పోలీసులు గమనించి వారు అడ్డుకున్నారు. వివరాలు.. స్థల వివాద విషయంపై సోమవారం ఎస్‌పి అన్బురాజన్‌ను కలిసేందుకు ఆరుగురు జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్నారు. వారిలో తల్లీకొడుకులు మేరీ, చిన్నబాలయ్య ఇద్దరూ ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది వెంటనే వారిని అడ్డుకున్నారు. వారిపై నీళ్లు పోసి ప్రయత్నాన్ని విరమింపజేశారు. అనంతరం ఎస్‌పి వద్దకు తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు వారిద్దరిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. వారిద్దరితోపాటు చిన్నబాలయ్య భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు వచ్చారు. అంతకు ముందు బాధితుడు బాలయ్య మీడియాతో మాట్లాడుతూ తాము కొండాపురం మండలంలోని సుగుమంచిపల్లెలో నివాసముంటున్నామన్నారు. మండలంలోని బుక్కపట్నం గ్రామంలోని ఆర్అండ్ఆర్ సెంటర్ పరిధిలో సి బ్లాక్‌లో ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని చూసేందుకు ఈనెల 12న వెళ్లాలని తెలిపారు. అదే సమయంలో హోమ్‌గార్డు తిరుపాల్, మరో ఇద్దరు తన సెల్‌ఫోన్ లాక్కొని దాడి చేయడమేగాక బెదించారని పేర్కొన్నారు. ఈనేపథ్యంలోనే ఈనెల 13న తనభార్యతో కలసి కొండాపురం నుంచి కడప రైల్వేస్టేషన్‌కు వచ్చి విషద్రావణం సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డానని, గమనించిన భార్య రిమ్స్‌కు తీసుకెళ్లిందని చెప్పారు. ఈనెల 17న పోలీసులు రిమ్స్‌కు వచ్చి విచారించి వెళ్లారని, తరువాత తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారన్నారు. తిరుపాల్‌తోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేయాల్సి ఉండగా కేవలం హోమ్‌గార్డుపై మాత్రమే ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టరని తెలిపారు. ఈ విషయంలో తమకు అన్యాయమే జరిగిందని భావించి తన కుటుంబ సభ్యులతో కలిసి ఎస్‌పి కార్యాలయానికి వచ్చి ఆత్మహత్యకు యత్నించామని పేర్కొన్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను కొండాపురం సిఐ సుదర్శన్‌ప్రసాద్‌ను, కుటుంబ సభ్యులను విచారించారు.



తల్లీకొడుకుల ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకుంటున్న పోలీసు సిబ్బంది

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యమ సంఘాలు బలపరుస్తున్న పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజుకు ప్రథమ ప్రాధాన్యత (1)ఓటు వేసి గెలిపించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి, ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ మాజీ నాయకులు వెంకట శివ, మల్లికార్జున, అంకుశం కోరారు. సోమవారం నగరం లోని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమ నేపథ్య అభ్యర్థులను గెలిపించడం ద్వారా శాసనమండలిలో ప్రజా గొంతుకతో ఉద్యోగ, నిరుద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు మార్గం సుముగమవుతుందన్నారు. పెద్దలు, మేధావులు కొలువుదీరే శాసన మండలికి అక్రమార్కులను, వ్యాపారస్తులను పంపకుండా ఉద్యమ పోరాట చరిత్ర కలిగిన వారిని పంపాలని చెప్పారు. మార్చి 13న జరగనున్న శాసన మండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత వివేకానంద రెడ్డిని కలసి ఇరువురికి ఓట్లు వేయవలసిందిగా అభ్యర్థించారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు



ర్యాలీగా వస్తున్న బండి సుమంత్‌కుమార్, ప్రమాణ స్వీకారం చేయిస్తున్న తులసిరెడ్డి

బండి సుమంత్ కుమార్ ప్రమాణ స్వీకారం


ప్రజాశక్తి - కడప

జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా బండి సుమంత్ కుమార్ పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అట్టహాసంగా నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసిరెడ్డి పదవి ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు ఆర్‌టిసి బస్టాండ్ వద్ద నున్న అంబేద్కర్ సర్కిల్ నుంచి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి భారీ ర్యాలీగా సుమంత్ కుమార్ వచ్చారు. బాణాసంచా పేలుస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. ప్రమాణ స్వీకారోత్సవ సభకు పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఎన్. తలసి రెడ్డి బండి సుమంత్ కుమార్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. యువజన అభివృద్ధి కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకొని బండి సుమంత్ కుమార్ పనిచేసే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. పార్టీ క్రమశిక్షణకు లోబడి, అందర్నీ కలుపుకొని, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని బండి సుమంత్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె పవన్ తేజా, శ్రీనివాస రావు, పిసిసి డెలిగేట్స్ బండి జకరయ్య, సత్తార్, ధ్రువ కుమార్ రెడ్డి, బండి మార్తమ్మ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, అన్వర్, నజీర్, కృష్ణారెడ్డి, శ్యామలాదేవి, చెప్పలి పుల్లయ్య, ప్రసాద్ గౌడ్, రామకృష్ణ, అమర్, మనోహర్ బాబు, గౌరీ, శ్రీనివాసులు, యేసయ్య, కనతల ప్రసాద్, వంశీ, సునీల్, అశోక్ నగర్ యూత్, అభిమానులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంకు క్షమాపణ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని రకీబ్ షావలి దర్గా స్థల వివాద విషయంలో మత గురువులను అరెస్టు చేస్తున్నారని ఆవేదనతో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా ౦ కించపరచి మాట్లాడిన తనను క్షమించాలని ప్రభుత్వ ఖాజీ షేక్ మహమ్మద్ ఇస్కార్ కోరారు. సోమవారం రవీంద్రనగర్‌లోని కాజీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబ్జాకు గురవుతుందని కొంతమంది తనకు చెప్పడంతో దర్గా వద్దకు వెళ్లానని తెలిపారు. అక్కడ మత గురువులను అరెస్టు చేయడానికి తట్టుకోలేక, ఆందోళనపై అవగాహన లేక డిప్యూటీ సీఎం బాధ్యత రాహిత్యంగా మాట్లాడానని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు జరగకుండా చూసుకుంటానని పేర్కొన్నారు. సమావేశంలో హఫీజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖాజీ షేక్ మహమ్మద్

తేక్వాండోలో 'గురుకుల్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్

తేక్వాండో సౌత్ జోన్ పోటీలలో ప్రతిభ చూపిన గురుకుల్ విద్యాపీఠ విద్యార్థులను ఎవిఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెంకటేశ్వర్లు అభినందించారు. సోమవారం గురుకుల్ విద్యాపీఠ్‌లో క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. చైర్మన్‌తో పాటు చిన్నచౌకు ఎస్ఐ రోషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడవ తరగతి చదువుతున్న అభిరాం గోల్డ్ మెడల్ తో పాటు సర్టిఫికెట్ పొందడం అభినందనీయమన్నారు. అండర్ -14లో సిల్వర్ మెడల్, సర్టిఫికెట్ సాధించారని తెలిపారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో గాయత్రికి సిల్వర్ మెడల్ ప్రశంసా అందుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వీరకుమారి, ఎవిఆర్ విద్యాసంస్థల సిఇఒ వివేకానంద, పల్లవి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఐ, చైర్మన్

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కడప : వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను ఎప్పటికప్పుడూ ప్రజల్లోకి వెళ్లి వివరిస్తూ ఉండాలని వైసిపి జిల్లా అధ్యక్షులు కె. సురేష్‌బాబు, ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా పేర్కొన్నారు. సోమవారం కడపలోని అపూర్వ కల్యాణమండపంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. తొలుత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. డివిజన్ కార్పొరేటర్లు ఇన్చార్జిలు సచివాలయ కన్వీనర్లు గృహ సారథులకు ప్రభుత్వ పథకాలు - నవరత్నాలు గురించి దిశా నిర్దేశం చేశారు.

విశ్రాంత విఆర్‌ఒపై చర్యలు తీసుకోవాలి

కాశినాయన : కత్తెరగండ్ల పంచాయతీ చెన్నవరం గట్టుపై ఉన్న సర్వే నంబర్ 1878 సర్వే నంబర్ల స్థలంలో విశ్రాంత విఆర్ఒ నాగిరెడ్డి బినామీ పట్టాలు సృష్టించి గట్టుపైన ఉన్న తమకు అన్యాయం చేశారని గ్రామస్తులు వాపోయారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ నాలుగు రోజుల కిందట బద్వేల్ ఆర్‌డిఒ ఆవుల వెంకటరమణ మండలానికి వచ్చిన సందర్భంలో సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన పూర్తి సమాచారం సేకరించాలని విఆర్ఒకు, విఆర్ఎ, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారని చెప్పారు. సోమవారం నాగిరెడ్డి కుమారులు సమస్య ఉన్న పొలంలో మొక్కలు నాటుతుండగా గ్రామస్తులు అక్కడికి చేరుకుని స్థల సమస్య ఆర్‌డిఒ వద్ద ఉన్నందున ఎందుకు మొక్కలు నాటుతున్నారని ప్రశ్నించారని తెలిపారు. దీంతో వారు గ్రామస్తులపై దాడికి దిగారని, దీనిపై నర్సాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

మహిళకు రక్తదానం

పోరుమామిళ్ల టౌన్ : బ్రహ్మంగారి మఠం మండలం జోకుపల్లె గ్రామానికి చెందిన ఎర్రంపల్లె మరియమ్మ హిప్టోపిక్ ప్రెగ్నెన్సీ కావడంతో అత్యవసరంగా ఆమె ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేరారు. హాస్పిటల్ వైద్య సిబ్బంది బి పాజిటివ్ రక్తం ఏర్పాటు చేసుకోవాల్సిందిగా తెలిపారు. బంధుమిత్రులు రక్తం కోసం రైట్ హ్యాండ్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నాయబ్ రసూల్‌ను సంప్రదించారు. ఆయన బిల్ కలెక్టర్ షేక్. సుహైల్‌చే రక్తదానం చేయించారు. అడిగిన వెంటనే సంస్థ వ్యవస్థాపకులు రసూల్‌కు, సుహైల్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పురం ప్రసాద్ ట్రస్ట్ సభ్యుడు అఖిల్, విజయ్, హృదయనాద్, రాజశేఖర్ పాల్గొన్నారు.



దాతను అభినందిస్తున్న సంస్థ వ్యవస్థాపకులు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి కవిత

సామాజిక న్యాయం అందుబాటులోకి రావాలి : జడ్జి

ప్రజాశక్తి-చెన్నూరు

పేదరికం, లింగం, శారీరక వివక్షత, నిరక్షరాస్యత, మతపరమైన వివక్షను తొలగించడానికి సామాజిక న్యాయం అందుబాటులోకి రావాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత పేర్కొన్నారు. ప్రపంచ న్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని దౌలతాపురం ఎస్‌టి కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న అసమానతలు, సంఘర్షణలు, బలహీనమైన సంస్థల ద్వారా విచ్ఛిన్నమైన సామాజిక ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని తెలిపారు. కార్మికుల హక్కుల కోసం అందరమూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, న్యాయవాది చంద్రకాంతమ్మ, పారా లీగల్ వాలంటరీ అరుణ కుమారి, ప్రజలు పాల్గొన్నారు.



పైప్‌లైన్ మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ యనమల సుధాకర్

పైప్‌లైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి - పోరుమామిళ్ల

స్థానిక పంచాయతీ పరిధిలోని శివాలయం నుంచి కొలిమి దర్గా వరకు రెండు నెలలుగా డ్రెయినేజీ మరమ్మతులు చేపడుతున్నారు. ఈనేపథ్యంలో పగిలిపోయిన పైప్‌లైన్‌కు సోమవారం పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ బాగు చేయించారు. ఈ సందర్భంఆ ఆయన మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి తన లక్ష్యమని చెప్పారు. పైప్‌లైన్ పగిలిపోయవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి వెంటనే నూతన పైప్‌లైన్ వేయిస్తున్నామని తెలిపారు. పంచాయతీలో ఇంకా ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

స్పందనలో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - కడప

ప్రజా సమస్యల పరిష్కారార్థం ఏర్పాటు చేసిన "స్పందన" కార్యక్రమంలో సోమవారం అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమానికి డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు యదుభూషన్ రెడ్డి, ఆనంద్ నాయక్ , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ మోహన్, నరసింహులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

సభా స్థలాన్ని పరిశీలించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు సభ ఏర్పాట్లను ఎస్‌పి అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప డిఎస్‌పి వెంకట శివారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ నెల 25న నగర పరిధిలోని ఎయిర్ పోర్ట్ సమీపంలో టిడిపి రాయలసీమ జోన్ సభ నిర్వహించనుంది. బందోబస్తు ఏర్పాట్లను డిఎస్‌పి, సిఐ అశోక్‌రెడ్డి, చెన్నూరు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి పరిశీలించారు. సభ ఏర్పాట్లు, పార్కింగ్, భోజన సౌకర్యం కల్పించే స్థలాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సమావేశ ఏర్పాట్లు చేపట్టాలని టిడిపి నేతలకు డిఎస్‌పి సూచించారు. సభ జరిగే ప్రాంతం, పార్కింగ్, భోజన స్థలాల వద్ద మార్పులు, చేర్పులను సూచించారు. సమావేశ వివరాలను టిడిపి నేతలను అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్ల గురించి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరి, మన్మోహన్ వివరించారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ మీడియా కో - ఆర్డినేటర్ జనార్దన్, టిడిపి నేతలు అమీర్, కాశీం పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి ఎఫ్‌సిఎన్ ప్రోత్సాహం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

పోరుమామిళ్ల కేంద్రంగా రెండు తెలుగు రాష్ట్రాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎఫ్‌సిఎన్ కడప పట్టణం మరియాపురంలోని సెయింట్ జోసెఫ్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న 380 మంది విద్యార్థులకు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్. గీత, తోమాస్ రెడ్డి చిత్తా దంపతులు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. వీటిని సంస్థ ప్రతినిధి ఎల్. ప్రసాదరెడ్డి సోమవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ఎఫ్‌సిఎన్ చేస్తున్న సేవలను విద్యార్థులకు వివరించారు. వాటిలో భాగంగానే విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దుస్తుల పంపిణీ చేపట్టామన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్. ఫాదర్. మరియన్న, హెడ్మాస్టర్ ఎస్. ప్రసాదరావు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదో విడత భూ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని, తొమ్మిది సంవత్సరాలుగా రాష్ట్రంలో భూ పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం లేదని, వెంటనే అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో కూడా అసైన్మెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించడంలో విఫలమయ్యారని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులను అసైన్‌మెంట్ కమిటీలో సభ్యులుగా చేర్చి పారదర్శకంగా సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, సుబ్రమణ్యం, బాదుల్లా, జిల్లా సమితి సభ్యులు మునయ్య, నాయకులు అశోక్ పాల్గొన్నారు.

రేపు వన్ మ్యాన్ కమిషన్ రాక

ప్రజాశక్తి - కడప

బోయ, వాల్మీకి కమ్యూనిటీ సమస్యలపై అధ్యయనం చేసేందుకు ఈనెల 22న కడపకు వన్ మ్యాన్ కమిషన్ సామ్యూల్ ఆనంద్ కుమార్ వస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 22న సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో బోయ, వాల్మీకి ప్రజలు, సంఘ నాయకులచే ఆయన సమావేశం నిర్వహిస్తారన్నారు. సమావేశానికి హాజరై తమ సమస్యలను అర్జీ రూపంలో శామ్యూల్ ఆనంద్ కుమార్‌కు బోయ, వాల్మీకి కమ్యూనిటీకి చెందిన వారు అందజేయవచ్చునని తెలిపారు.

హుండీ ఆదాయం రూ.4.79 లక్షలు

ప్రజాశక్తి - చాపాడు

మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానానికి హుండీ కానుకలు, దుకాణాలు, దర్శన టికెట్ల ద్వారా రూ.4.79 లక్షల ఆదాయం వచ్చినట్లు ఇఒ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం చైర్మన్ జిబి వెంకట సుబ్బారెడ్డి, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీలో రూ.2.87 లక్షలు, దర్శనం కోసం వచ్చిన భక్తుల ద్వారా రూ.1.51 లక్షలు, దేవాలయ ఆవరణలో దుకాణాలు ఏర్పాటుకు రూ.41వేలు వచ్చిందన్నారు. సోమవారం పల్లకిసేవతో ఉత్సవాలు ముగిశాయని ఇఒ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అధికారులు, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తమ వంతు కృషి చేశారని కొనియాడారు.



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

రామశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - ఖాజీపేట

విద్యార్థుల, విద్యారంగ అభివృద్ధికి సాయితేజ పాఠశాల యజమాని దివంగత సాలిగారి రామశేఖర్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని, ఆయన అందించిన సేవలు మరువలేనివని మైదుకూరుకు చెందిన శ్రీ సాయి స్కూల్ కరస్పాండెంట్ తవ్వా ఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సుంకేసుల బైపాస్ రోడ్‌లోని శ్రీ సాయితేజ హైస్కూల్‌లో సోమవారం కరస్పాండెంట్ సాలిగారి రామశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి రామశేఖర్‌రెడ్డి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రస్తుత కరస్పాండెంట్ సాలిగారి రాజేశ్వర పూలమాలవేసి నివాళులు అర్పించారు. పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న తవ్వా సాయి ఓబుల్‌రెడ్డి

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి : ఓఎస్‌డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పాడా ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. స్థానికంగా నిర్మిస్తున్న జగనన్న లేఅవుట్ కాలనీని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నిర్ణీత సమయంలో నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం అయినందున రాష్ట్రంలోనే ఈ కాలనీ ఆదర్శంగా రూపొందించాలన్నారు. నిర్మాణ పనులు ఏ దశలో ఎన్ని ఉన్నాయనే విషయాలను హౌసింగ్ ఎఇ సంజీవరాయుడుని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, వార్డ్ ఏమ్యూనిటీ సెక్రటరీలు, కాంట్రాక్టర్లు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి ఐక్యంగా పనిచేద్దాం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పురపాలక అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేసి మరెన్నో అవార్డులు తీసుకోవద్దామని పురపాలక కమిషనర్ వివి నరసింహారెడ్డి కోరారు. మునిసిపల్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన సచివాలయం ప్లానింగ్, అమెనిటీ, శానిటేషన్ సెక్రటరీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో నీటి సరఫరాకు అంతరాయం లేకుండా ఇంజనీరింగ్ వారు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం, ఇంటి నిర్మాణ వ్యర్థాల తరలింపు, నీటి సరఫరా, నీటి పైప్‌లైన్ లీకేజీ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మునిసిపల్ డిఇ సుభాష్ చంద్రబోస్, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ నరసింహారెడ్డి

23 వరకు ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అవకాశం

ప్రజాశక్తి - చాపాడు

పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఇంకా ఎవరైనా ఓటు నమోదు చేసుకోని వారికి ఈనెల 23 వరకు అవకాశం ఉందని తహశీల్దార్ సుభాని తెలిపారు. మండల పరిధిలోని అర్హులైన వారు ఆన్‌లైన్‌లో కానీ దరఖాస్తును కార్యాలయంలో గాని అందజేసి ఓటు పొందాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు, నివాసాల మధ్య చెత్త



రోడ్లపైనే చెత్త.. అక్కడే కాల్చివేత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని పోట్లదుర్తి గ్రామంలో రోడ్డు, నివాసాల మధ్య పేరుకుపోయిన చెత్త పేరుకుపోయి ఉంది. ఆ ప్రాంతవాసులు అపరిశుభ్రంతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. డస్ట్‌బిన్లు లేకపోవడంతో ఇళ్లలోని చెత్తను రోడ్డు పక్కన వేస్తున్నారు. అది రోజుల తరబడి అక్కడే ఉండడంతో కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రొద్దుటూరు-ఎర్రగుంట్ల ప్రధాన రహదారి కావడంతో రోజూ వందల వాహనదారులు ఆ రోడ్డు గుండా ప్రయాణిస్తూ ఉంటాయి. ప్రయాణికులు ఆ ప్రాంత సరిహద్దు నుండే దుర్వాసన రావడంతో ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి. చెత్త కారణంగా అక్కడున్న కాలువలు పూర్తిగా పూడినవి. దీంతో గ్రామంలోని వృథా నీరు కాలువల వెంబడి వెళ్లలేక రోడ్లపైనే ప్రవహిస్తోంది. అంతేకాకుండా ఇళ్ల మధ్యలో కంపచెట్లు గుబురుగా పెరగడంతో విష పురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు హడలిపోతున్నారు. పక్కనే ప్రభుత్వ బాలుర వసతి గృహం ఉంది. అక్కడ వేసిన చెత్తను అక్కడే కాల్చుతున్నారు. దీంతో వచ్చే పొగ వల్ల ఆ రహదారిన వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పొగ వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతం డంపింగ్ యార్డ్‌ను తలపించేలా చెత్త పేరుకుపోయింది. దోమల బెడద ఎక్కువైందని, రోగాల పాలవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ ఒక్క చోటే కాకుండా గ్రామంలో అక్కడక్కడ ఇదే పరిస్థితి కనపడుతోంది. ఇంటి పన్ను పేరుతో వందల రూపాయలు వసూలు చేస్తున్నారే కానీ.. చెత్తను మాత్రం తీసివేసే పరిస్థితుల్లో అధికారులు లేరని గ్రామస్తులు అగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని చెత్తను వేరే ప్రాంతాలకు తరలించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజేంద్ర ప్రసాద్‌ను వివరణ కోరగా శానిటేషన్ విభాగంలో కార్మికులు తక్కువగా ఉన్న కారణంగా కొద్ది రోజులు అక్కడే చెత్త వేసిన మాట వాస్తవమేనని, ప్రస్తుతం ఆ సమస్య లేకపోవడంతో బయటకు తరలిస్తున్నామని తెలిపారు.

ప్రజల ఆరోగ్యంపై అశ్రద్ధ



గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయింది. దీనివల్ల గ్రామస్తులు అనారోగ్యాలకు గురవుతున్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇంటి పన్ను వసూలు చేసే సమయంలో ఉండే శ్రద్ధ ప్రజల ఆరోగ్యాలపై కూడా ఉంటే బాగుంటుంది.

- వర ప్రసాద్ రెడ్డి, పోట్లదుర్తి

మద్దతు ధరతో శనగలు కొనుగోలు

ప్రజాశక్తి - వేంపల్లె

మద్దతు ధరతో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా శనగలు కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ ఎడిఎ అశోక్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నాగూరు గ్రామం గోడౌన్‌లో సోమవారం బుడ్డ శనగల కొనుగోలు కేంద్రాన్ని ఎడిఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే రైతు మొబైల్‌కు ఒటిపి వస్తుందన్నారు. రైతులకు కేటాయించిన సమయంలో గౌడన్ వద్దకు శనగలను తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని బుడ్డ శనగ రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్, రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.



శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎడిఎ అశోక్‌రెడ్డి

ఆట స్థలంలో మట్టి తొలగింపు



మట్టి తొలగించడంతో శుభ్రంగా ఉన్న ఆటస్థలం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆటస్థలంలో ఉన్న మట్టిని సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులు తొలగించారు. మట్టి, రాళ్లను జెసిబి సాయంతో దూర ప్రాంతానికి తరలించారు. విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకున్నారు. జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆట స్థలంలో ఉన్న మట్టి, రాళ్లను తొలగించి, శుభ్రం చేయించారు. గతంలో 'ప్రజాశక్తి' దినపత్రికలో దీనిపై కథనం వెలువడింది. ఆటస్థలంలో మట్టిని తొలగించడం పట్ల విద్యార్థులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



నజీర్‌ను సన్మానిస్తున్న తులసిరెడ్డి

ప్రజల సౌభాగ్యం కోసం కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తేవాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ ఇన్‌ఛార్జి ఎస్‌పిఎండి నజీర్ పిలుపునిచ్చారు. జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్ష ప్రమాణస్వీకారానికి అధిష్టాన పిలుపు మేరకు స్థానిక నాయకులు రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు మహ్మద్ రఫీతో కలిసి సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా నజీర్‌ను పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పార్టీ ఎప్పుడూ గొప్ప ఆలోచనలే చేస్తుందన్నారు. పార్టీకి కార్యకర్తల, నాయకులకు కొదవలేదన్నారు. ప్రొద్దుటూరులో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు శాయశక్తుల కృషి చేస్తామని తెలిపారు

వృద్ధాశ్రమంలో ఆర్‌ఒ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక దొరసానిపల్లె బైపాస్ రోడ్డులో ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమంలో సోమవారం వివేకానంద ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ఆర్‌ఒ ప్లాంట్‌ను వన్‌టౌన్ సిఐ కె.రాజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి 13 ఏళ్లుగా తనకు బాగా సుపరిచితుడన్నారు. చిన్న వయసులోనే సమాజసేవకు అంకితమైన ఆయన తన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నేటి యువతకు ఆదర్శప్రాయుడుగా నిలుస్తున్నారన్నారు. తాను సేవ చేయడమేగాక తనతోటి సంస్థలకు, ఆశ్రమాలకు సహాయం చేయడం అభినందనీయమన్నారు. ఆశ్రమంలోని అవ్వతాతలందరూ గతమంతా వదిలేసి చివరి దశలో ఆనందంగా గడపాలని సిఐ ఆకాంక్షించారు. అనంతరం వృద్ధులకు అల్పాహారం వడ్డించారు. కార్యక్రమంలో వివేకానంద ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సురేష్, ఆశ్రమ నిర్వాహకులు సుబ్బారాయుడు పాల్గొన్నారు.




ఆర్‌ఒ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సిఐ కె.రాజారెడ్డి

టిడిపిని ఆదరించండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఇళ్ల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని వివేకానంద కాలనీలో సోమవారం ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. మార్చి నెలాఖరులోగా 5లక్షల జగనన్న ఇళ్లు పూర్తి చేయాలని చెబుతున్నారన్నారు. ఈ ప్రాంతాల్లో కడుతున్న జగనన్న కాలనీల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. 10 శాతం కూడా బేస్ మట్టలు పూర్తి కాలేదన్నారు. ఇల్లు లేని నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేదలకు నీడ ఇవ్వలేని ప్రభుత్వం ఎందుకని 2024 ఎన్నికల్లో టిడిపికి పట్టం కట్టాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి, ఆవుల అరుణ్‌తేజ, గంగోటి నాగ మల్లయ్య, బత్తల వెంకటేష్, రామచంద్రుడు, రాజేష్, రాము, క్యాటరింగ్ శివ, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, ప్రొద్దుటూరు నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షుడు తమ్మిశెట్టి సురేంద్ర, పట్టణ కార్యదర్శి తమ్మిశెట్టి శ్రీనివాసులు, పెన్నానగర్ మజీద్ పాల్గొన్నారు.



కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



మహేశ్వర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పార్టీ అండగా ఉంటుంది : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఆర్.తుమ్మలపల్లి గ్రామానికి చెందిన వైసిపి జడ్‌పిటిసి తుమ్మల మహేశ్వర్‌రెడ్డి భౌతికకాయానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నివాళులర్పించారు. గంగమ్మ జాతరలో ఆదివారం ఆయన సిరి బండి మహోత్సవంలో ప్రమాదవశాత్తూ చక్రాల కింద పడి మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఎంపీ అవినాష్‌రెడ్డి సోమవారం తుమ్మలపల్లెకు వెళ్లి మహేశ్వరరెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంఘటన గురించి మృతుడి కుమారుడు హేమంత్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మహేష్‌రెడ్డి మృతి చాలా బాధాకరమన్నారు. పార్టీకి ఆయన ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని తెలిపారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్ రెడ్డి, తొండూరు మండల ఇన్‌ఛార్జి వైయస్ మధురెడ్డి, పులివెందుల మున్సిపాలిటీ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్ రెడ్డి, పురపాలక చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, గండి ఆంజనేయ స్వామి ఎఒ ముకుందారెడ్డి, వైసిపి నాయకులు బలరామిరెడ్డి, బయపురెడ్డి నివాళులర్పించారు.

మహేశ్వరరెడ్డి మృతి బాధాకరం : పిసిసి

వేంపల్లె : పులివెందుల జడ్‌పిటిసి మహేశ్వరరెడ్డి మృతి బాధాకరమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన కుటుంబానికి తన సంతాపం తెలిపారు. వేంపల్లె జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, అయ్యవారిపల్లె సర్పంచ్ రామగంగిరెడ్డి, రాచినేని శ్రీనివాసులు ఆర్.తుమ్మలపల్లె గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు

మాజీ ఎంపిటిసి మృతికి 'రెడ్యం' సంతాపం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని సి.కొత్తపేటకు చెందిన మాజీ ఎంపిటిసి ఉప్పటూరు చిన్న మాలకొండయ్య (86) మృతికి సోమవారం టిడిపి సీనియర్ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి సంతాపం తెలిపారు. చిన్న మాల కొండయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపిటిసిగా చిన్న మాలకొండయ్య అభివృద్ధి కోసం కృషి చేశారని కొనియాడారు.

ఇంజినీరింగ్ ఫలితాల్లో సిబిఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చాపాడు

జెఎన్‌టియు అనంతపురం వారు ఇటీవల విడుదల చేసిన ఇంజినీరింగ్ చివరి సంవత్సరం మొదటి సెమిస్టరు పరీక్షా ఫలితాల్లో సిబిఐటి కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి ఉత్తమ ఫలితాలు సాధించారు. అందులో సివిల్ విభాగానికి చెందిన టి.కె.ధరణి-90.53శాతం, యస్.ఈ.షాహిద్ అఫ్రిద్ 84, యం.అజిత్ 83.33, ఈఈఈ విభాగానికి చెందిన వి.దివ్యశ్రీ 83.33, సి.దివ్యశ్రీ 83.07, యన్.జయశ్రీ 82.40, మెకానికల్ విభాగానికి చెందిన యస్.మహమ్మద్ జాఫర్ అలీ 83.18, బి.వెంకటచైతన్యరెడ్డి 81.18, యన్.వెంకట సాయికుమార్ 81.06, ఇసిఇ విభాగానికి చెందిన ఇ.సైరాభాను 87.33శాతం, కె.వెంకటశివ 84.93, వై.నందిని 84.93, సియస్ఇ విభాగానికి చెందిన ఎ.శ్రీవిద్య 85.33, వై.వాసవి 84.27, వి.సౌమ్య 84.13శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

సకాలంలో వాహనాల పన్నులు చెల్లించండి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలో లారీలకు సంబంధించిన పన్నులు తప్పనిసరిగా చెల్లించాలని ఎంవిఐ బి.వెంకట ప్రసాద్ కోరారు. సోమవారం ఆయన ముద్దనూరు రోడ్డులో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంవిఐ లారీలకు లైసెన్సులు, రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. పన్నులు వెంటనే చెల్లించాలన్నారు. టాక్స్ కట్టాలనుకునేవారు మీసేవ కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్లలో టాక్స్ రూపంలో పనులు కట్టవచ్చునని తెలిపారు. టాక్స్ లేకపోతే వాహనాలు సీజ్ చేస్తామన్నారు.



వాహనాల తనిఖీ కార్యక్రమంలో ఎంవిఐ వెంకటప్రసాద్

క్రైం కార్నర్

ఘర్షణ కేసులో 11 మందిపై కేసులు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో శని, ఆదివారాల్లో జరిగిన ఘర్షణలో ఇరు వర్గాలకు సంబంధించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కెసి రాజు తెలిపారు. శుక్రవారం రాత్రి పాట కచేరి వద్ద సీతంపల్లెకు చెందిన ప్రదీప్‌పై అల్లాడుపల్లెకు చెందిన కొంతమంది దాడి చేసిన సంఘటనలో కిషోర్‌కుమార్‌రెడ్డి మరో 9మిది మందిపై కేసు నమోదు చేశారు. అలాగే ఆదివారం అన్నదాన సత్రం వద్ద అల్లాడుపల్లెకు చెందిన కిషోర్‌కుమార్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిపై దాడి చేసిన సంఘటనలో సీతంపల్లెకు చెందిన బండి కిషోర్‌తోపాటు మరో 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'ఉపాధి' బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని ఉపాధి హామీలో పనులు చేపట్టిన ప్రదేశాల్లో వివరాలతో కూడిన సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. పని జరిగిన గ్రామ పంచాయతీ, చేపట్టిన పనులు, విలువ, మొత్తం కూలీల సంఖ్య, జాబ్ కార్డుదారుల వివరాలు వంటి వాటిని సూచిస్తూ రాతి బండలపై రాయించారు. మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీల్లో ఈ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. గతేడాది ఆగస్టులో వీటిని సిద్ధం చేసినప్పటికీ ప్రస్తుతం సామాజిక తనిఖీ చేపడుతున్న నేపథ్యంలో పని ప్రదేశాల్లో ఏర్పాటు చేశారు. గతంలో ఉపాధి హామీ రోడ్లు, ఇతర పనులు చేపట్టిన సందర్భంలో ఇనుప బోర్డులు ఏర్పాటు చేసేవారు. తర్వాత చిన్న చిన్న పనుల వద్ద ఎలాంటి బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. ఆడిట్ సమయంలో సమస్యలు వస్తుండడంతో వివరాలను బండి పలకలపై రాయించి బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.



సిద్దారెడ్డిపల్లె వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

సిఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు



మిఠాయి తినిపిస్తున్న సంఘం నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

ఎమ్మెల్సీ పదవుల్లో గుంటూరుకు చెందిన ఏసురత్నంకు సముచిత స్థానం కల్పించిన సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వడియరాజుల సంఘం అధ్యక్షుడు మల్లె సంటెన్న కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి జగన్ విడుదల చేసిన ఎమ్మెల్సీ జాబితాలో ఏసురత్నం పేరును ప్రకటించారు. ఈ నేపథ్యంలో వడియరాజులు అందరూ మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంటెన్న మాట్లాడుతూ సిఎం జగన్ బిసిలకు పెద్దపీట వేసి ఎమ్మెల్సీ ఇవ్వడం సంతోషకరమన్నారు. వడియరాజులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్, డైరెక్టర్లు పదవులు కల్పించిన ఘనత వైసిపిదేనని తెలిపారు. ఎల్లవేళలా సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వడియరాజులంతా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వడియరాజుల సంఘం నేతలు పాల్గొన్నారు.

వ్యాయామం, యోగా ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి - ముద్దనూరు

మనిషికి శారీరక శ్రమ ఎంతో అవసరమని, వ్యాయామం, యోగా ఆరోగ్యానికి మేలు చేస్తాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మేళా వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని బడుగువారిపల్లె ప్రాథమిక పాఠశాలలో యోగా, ఆసనాలు, సైక్లింగ్‌పై విద్యార్థులకు శ్రీకాంత్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శరీర దృఢత్వం కోసం యోగా, ఆసనాలు, వ్యాయామం చేయాలన్నారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా సైక్లింగ్ చేయడం వల్ల ఒత్తిడి తగ్గి, బరువు అదుపులో ఉంటుందన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒలు మహదేవ, గణేష్, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.